
సాక్షి తిరుపతి

బుధవారం । 12 । మార్చి । 2025



కారులో చెలరేగిన మంటలు

కారులో మంటలు చెలరేగిన ఘటన పాకాల మండలం పుదిపట్లలో చోటుచేసుకుంది. ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. - 8లో



రోగులకు సీఎం సహాయ నిధి చెక్కులు

జిల్లాలో వివిధ రోగాలతో బాధపడుతున్న రోగులకు సీఎం సహాయ నిధి చెక్కులు కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిణీ చేశారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం (ఉ)
తిరుపతి	6-26	5-03
గూడూరు	6-20	4-59

న్యూస్‌రీల్

యువత పోరుకు తరలిరండి

తిరుపతి లీగల్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న 'యువత పోరు'ను విజయవంతం చేయాలని ఆ పార్టీ లీగల్ సెల్ తిరుపతి అధ్యక్షుడు దొరబాబు (మునిబాల సుబ్రమణ్యం) ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉద్యోగాల కల్పన లేకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెనల బకాయిలు చెల్లించకుండా, వైద్య విద్యను ప్రైవేటీకరిస్తూ విద్యార్థులను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి బకాయిలు చెల్లించేలా 'యువత పోరు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షకు 941 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్‌లో 32,541మంది, ఒకేషనల్‌లో 1,357మంది మొత్తం 33,898 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంది. అయితే వీరిలో 941 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షలో భాగంగా బుధవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పని ఒత్తిడి తగ్గించండి



ఎంపీడీఓ సౌభాగ్యంకు వినతిపత్రాన్ని అందిస్తున్న కార్యదర్శులు

ఏర్పేడు(రేణిగుంట): తమకు సర్వేల పేరుతో పనిభారం మోపొద్దని ఏర్పేడు ఎంపీడీవో సౌభాగ్యంకు మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు విన్నవించారు. కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు షఫీవుల్ల, కోశాధికారి లోకముని ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. అన్ని శాఖల పనులు తమకే చెప్పి సర్వేలను పూర్తి చేయాలని ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు.

పిచ్చాటూరు అంగన్‌వాడీ కార్యకర్తకు బ్రెయిన్‌స్ట్రోక్

– ధర్నా కోసం విజయవాడకు వెళ్లి కుప్పకూలిన వైనం



విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాణిశ్రీ

నాగలాపురం: పిచ్చాటూరు అంగన్‌వాడీ కార్యకర్త బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆస్పత్రి పాలయ్యారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఆమె తోటి అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆదివారం విజయవాడలో జరిగిన మహాధర్నాకు బయలుదేరి వెళ్లారు. సోమవారం ఉదయం ధర్నా చేపట్టడానికి తోటి కార్యకర్తలతో కలిసి అలంకార్ ప్రాంగణానికి వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆమెను విజయవాడలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు ఆమెకు చిన్నమెదడు చిట్లిపోయి రక్తం గడ్డకట్టినట్టు నిర్ధారించారు. కనీసం 24 గంటలు గడిస్తే గానీ ఆమె ఆరోగ్య పరిస్థితిని చెప్పలేమని వైద్యులు చెప్పినట్టు సమాచారం. ప్రస్తుతం వాణిశ్రీకి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు.

15న జాబ్‌మేళా

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, ప్రిన్సిపల్ నాగరాజునాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ, జేకేసీ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. పలు బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పదోవ తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ ఉత్తీర్ణత సాధించి యువతీయువకులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్సులు, బయోడేటాతో పాటు సంబంధిత రిజిస్ట్రేషన్ లింక్‌లో నమోదు చేసుకున్న అడ్మిట్ కార్డుతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7989509540, 8919889609 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

• శ్రీకాళహస్తికి చెందిన రైతు చెంచుకృష్ణయ్య కుమారుడు తిరుపతి నగర శివారులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. 2024కు సంబంధించి మూడు విడతల్లో జమ కావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ అందలేదు. దీంతో ఆ విద్యార్థిని పలుమార్లు కళాశాల యాజమాన్యం హెచ్చరించింది. తల్లిదండ్రులకు సైతం సమాచారం అందించింది. ఫీజు చెల్లించకపోతే పరీక్షకు హాజరుకానివ్వమంటూ హుకుం జారీ చేసింది. చేసేది లేక రూ.3కు వడ్డీ తెచ్చి ఫీజు చెల్లించారు.

• తిరుపతికి చెందిన శేఖర్‌నాయక్ ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. డిగ్రీ అడ్మిషన్ల సమయంలో ఎస్ఎస్సీ, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యం తీసుకుంది. ఇటీవల పోస్టాఫీసులో పోస్ట్‌మెన్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసేందుకు ఆ సర్టిఫికెట్లు అవసరం కావడంతో కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించాడు. అయితే పెండింగ్ ఫీజులు చెల్లించనిదే ఇవ్వడం కుదరదని తెగేసి చెప్పారు. తన తల్లి బంగారు నగలు తాకట్టు పెట్టి రూ.25 వేలు ఫీజు చెల్లించారు.

..ఇది మచ్చుకు రెండు మాత్రమే. ఇలాంటి వారు జిల్లాలో కోకొల్లలు. గత ఏడాదిగా ఫీజురీయింబర్స్‌మెంట్ అందక.. కళాశాల యాజమాన్యాల ఒత్తిడి తట్టుకోలేక నలిగిపోతున్నారు. కొందరు పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేమేమోనని ఆందోళనలో మునిగిపోయారు. మరికొందరు వడ్డీలకు తెచ్చి, ఇంట్లోని బంగారు నగలు తాకట్టుపెట్టి కళాశాలలకు బకాయిలు చెల్లిస్తున్నారు. బాబు బకాయిలపై విద్యార్థులు లడాయికి సిద్ధమయ్యారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు జరగనున్న యువతపోరుకు సిద్ధమయ్యారు.



బాబు పన్నాగం
ఫీజులకు ఎగనామం

విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం

- ఏడాదిగా చెల్లించని ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఒత్తిడి చేస్తున్న కళాశాలల యాజమాన్యాలు
- అష్టకష్టాలు పడుతున్న పేద విద్యార్థులు
- నేడు యువత పోరుకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ
- తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు భూమన ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలో విద్యార్థులకు అందించాల్సిన బకాయిలను బాబు ప్రభుత్వం తుంగలో తొక్కింది. 2015 నుంచి 2019వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఉన్న బకాయిలను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే రూ.110 కోట్లు విడుదల చేశారు. అలాగే గత ప్రభుత్వంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులకు కలగకుండా ప్రతి ఏటా క్రమంతప్పకుండా నాలుగు త్రైమాసికాల్లో బకాయిలను జమచేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలపై నోరెత్తకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నేడు కలెక్టరేట్ ఎదుట 'యువత పోరు'

జిల్లాలో అర్హులైన ప్రతి విద్యార్థికీ బకాయిలతో పాటు ఫీజురీయింబర్స్‌మెంట్ తక్షణం చెల్లించాలన్న డిమాండ్‌తో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు యువత పోరుకు సిద్ధమయ్యారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో కదం విద్యార్థులు తొక్కనున్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ అందించాల్సింది

కోర్సు	విద్యార్థుల సంఖ్య
డిగ్రీ (22 విభాగాల కోర్సులు)	32,762
బీటెక్	23,723
ఎంబీబీఎస్	1,021
డిప్లొమో	21,150
ఇతర ప్రొఫెషనల్ కోర్సులు	3,675

ఏడాది నుంచి నిలిపేశారు



మాది గూడూరు. ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నా. గత ఏడాది నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ నిలిపేశారు. మీరే ఫీజు కట్టాలని కళాశాల యాజమాన్యం హెచ్చరిస్తోంది. ఇక మాలాంటి పేదలు ఉన్నత చదువుల చదవాలంటే కష్టతరమే.

–ఎస్ ప్రశాంత్, ఇంజినీరింగ్ విద్యార్థి, గూడూరు

టూషన్లు చెప్పి..



నేను ఓ ప్రైవేటు కళాశాలలో డిప్లొమో ఈఈఈ చేస్తున్నా. ఫీజురీయింబర్స్‌మెంట్ అందుతుందనే ఆశతో చేరా. కానీ కళాశాలలో అడ్మిషన్ పొందిన నాటి నుంచి రీయింబర్స్ మెంట్ అందలేదు. కళాశాలలో చదువకుంటూ టౌన్‌లో సాయంత్రం పార్ట్‌టైమ్‌గా పిల్లలకు హోమ్ ట్యూషన్లు చెప్పుకుంటూ ఫీజుకు నగదు సమకూర్చుకుంటున్నా.

– ఎస్ చిరంజీవులు, డిప్లొమో విద్యార్థి, తిరుపతి రూరల్, చంద్రగిరి

యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది



మాది నాగలాపురం. పుత్తూరు సమీపంలోని ఓ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నా. ఇప్పటి వరకు రెండేళ్లు పాటు క్రమంతప్పకుండా మా అమ్మ బ్యాంకు ఖాతాలో నేరుగా ఫీజురీయింబర్స్‌మెంట్ పడేది. కానీ గత ఏడాది నుంచి రావడం లేదు. కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

– తిలక్, బీటెక్ విద్యార్థి, సత్యవేడు

అప్పులు చేశాం



మా అబ్బాయి తిరుపతిలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత ప్రభుత్వంలో క్రమంతప్పకుండా ఫీజురీయింబర్స్‌మెంట్ అందించారు. విద్యార్థి చదువుకు ఇబ్బంది లేకుండా ఉండేది. పది నెలలుగా ఒక్కపైసా కూడా అందలేదు. కళాశాల వాళ్లు టార్చర్ పెడుతున్నారు. అబ్బాయి ఫైనల్ ఇయర్ పరీక్షలకు హాజరుకానివ్వరనే బయంతో అప్పుచేసి ఫీజుకట్టేశాను.

– ప్రమీలమ్మ, విద్యార్థి తల్లి, తిరుపతి

యువత పోరు డిమాండ్లు

- జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వంలో 2019వరకు ఉన్న సుమారు రూ.110 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లోనే చెల్లించింది.
- 2023 నుంచి 2024 వరకు ఉన్న రూ.57.1 కోట్ల బకాయిలను చెల్లించాలి.
- 2024-2025 విద్యాసంవత్సరంలో సుమారు రూ.210కోట్లు చెల్లించాల్సి ఉంది.
- బడ్జెట్‌లో తూతూమంత్రంగా ఫీజురీయింబర్స్‌మెంట్‌కు నిధులు కేటాయించారు. వాటిని రివైజ్డ్ చేయాలి.
- అర్హులైన ప్రతి విద్యార్థికీ ఫీజురీయింబర్స్‌మెంట్ సెమిస్టర్ వైజ్‌గా నగదు జమచేయాలి.
- నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు అందించాలి.
- డీఎస్సీతో పాటు 20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్లు, జాబ్‌క్యాలెండర్ విడుదల చేయాలి.



వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జెండా ఆవిష్కరిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

యువత పోరు జెండా ఆవిష్కరణ

తిరుపతి మంగళం: తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించనున్న యువత పోరుకు సంబంధించిన జెండాను మంగళవారం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆ పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా నిర్లక్ష్యంగా వివరిస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత పోరు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉదయవంశీ, దినేష్‌రాయల్, అనిల్‌రెడ్డి, మల్లం రవి పాల్గొన్నారు.



ఎస్వీయూలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నాయకులు ప్రేమ్

రాజకీయ ప్రాధాన్యత పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: మహిళలకు రాజకీయ ప్రాధాన్యత పెరినప్పుడే సమాజంలో స్త్రీకి సమానత్వం నిర్మితమవుతుందని వీసీ సీహెచ్ అప్పారావు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరిగిన మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సాంకేతిక యుగంలోనూ మహిళలపై వివక్ష తగదన్నారు. సోషల్ మీడియాలో మహిళల పట్ల అభ్యంతరకర పోస్టులు పెడుతుండటం దారుణమన్నారు. అనంతరం చిత్ర లేఖనం, వక్తృత్వ పోటీలు, ఎగ్జిబిషన్, లింగ సమానత్వం, హింసలపై విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. విభాగాధిపతి డాక్టర్ సాయి సుజాత, డీఎస్పీ శ్రీలత, ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ రమణ, డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏప్రిల్ 30న నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

స్పేస్ పోర్టు నిర్మాణానికి భూమిపూజ



తమిళనాడులోని కులశేఖరపట్నంలో భూమిపూజ

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కులశేఖర్‌పట్నంలో ఎస్ఎస్ఎల్‌వీ లాంచ్‌కాంప్లెక్స్ (ఎస్ఎల్‌సీ) నిర్మాణానికి ఈనెల 5న భూమిపూజ చేసినట్టు ఇస్రో తన వెబ్‌సైట్‌లో మంగళవారం తెలిపింది. చిన్న ప్రయోగాలు, వాణిజ్యపరమైన ప్రయోగాలను ఎస్ఎస్ఎల్‌వీ లాంటి చిన్నతరహా రాకెట్ల ద్వారా చేయడానికి ఈ స్పేస్‌పోర్టు నిర్మాణాన్ని చేపట్టినట్టు వెల్లడించింది. ప్రయివేట్ సంస్థలకు చెందిన చిన్న చిన్న రాకెట్లకు కూడా మంచి డిమాండ్ ఉండడంతో కులశేఖరపట్నంలో రాకెట్ కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

మద్యం షాపు మార్పునకు నోటీసు

తిరుపతి క్రైమ్: గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాల్లో ఓ షాపును మార్పు చేయడానికి నోటీస్ ఇచ్చినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. గీత కులాలకు 23 దుకాణాలు కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయితే తిరుపతి రూరల్ మండలంలోని అవిలాల సాయినగర్‌లో ఏర్పాటు చేసిన ఫ్రెండ్లీ వైన్స్‌కు సంబంధించి అధికారిక కారణాల నేపథ్యంలో ఆ దుకాణాన్ని మరోచోటుకు మార్పు చేయడానికి లైసెన్స్ దారుడుకి నోటీస్ ఇచ్చామని స్పష్టం చేశారు.

కళా నీరాజనం!



దహన క్రియలు నిర్వహిస్తున్న కుమారుడు (ఇన్‌సెట్) గరిమెళ్ల భౌతిక దేహం



గరిమెళ్లకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



తల్లిని ఓదార్చుతున్న కుమారుడు అనిల్‌కుమార్

ప్రముఖ టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు మంగళవారం ప్రభుత్వ లాంఛనాలతో గౌరవ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనలను వైవిధ్యభరిత రాగాలతో స్వరపరిచి తిరుమల శ్రీవారి వైభవాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన గరిమెళ్ల పార్థివ దేహాన్ని అశేష కళాభిమానులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. భవానీ నగర్‌లోని ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, టీటీడీ సీపీఆర్‌వో టీ.రవి, ప్రముఖ సినీ గాయని జానకి సోదరి శారద, ప్రముఖ గాయకుడు కార్తికేయ ఘన నివాళులర్పించారు. గరిమెళ్ల అంతిమయాత్ర దేవేంద్ర థియేటర్ వద్దనున్న హరిశ్చంచంద్ర శ్మశాన వాటిక వరకు సాగింది. కుమారుడైన అనిల్‌కుమార్ తనతండ్రి గరిమెళ్ల దహన సంస్కారాలు పూర్తి చేశారు. – తిరుపతి కల్చరల్

జిల్లాలో మూడు ఇసుక పాయింట్లు



ఇసుక కొత్త పాయింట్ల ఏర్పాటుపై మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి అర్బన్: జిల్లాలో ఈనెల 15వ తేదీలోపు మూడు ఉచిత ఇసుక పాయింట్లు (స్వర్ణముఖినది ఆధారంగా)అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలసి అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కోట మండలం, గూడలి వద్ద ఒక ఇసుక పాయింట్, పెళ్లకూరు మండలం, పుల్లూరు సమీపంలో రెండు ఇసుక పాయింట్లు గుర్తించామని చెప్పారు. ఈ మూడు పాయింట్ల నుంచి 1,37,686 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తోడుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే డీసిల్టేషన్(ఇసుక పాయింట్ల) వద్ద ఇసుక తవ్వడానికి, రవాణా చేయడానికి ఏజెన్సీలను నియమించినట్టు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకుని నేరుగా ఇసుక పాయింట్ల వద్దకు వెళ్లి రుసుం చెల్లించి ఇసుక తీసుకుపోవాలని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఇసుక పాయింట్ల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఇసుక పారదర్శకంగా అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తడ, గాదంకి, సురుటుపల్లి చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు రామమోహన్, భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా గనులశాఖ అధికారి బాలాజీ నాయక్, గూడూరు ఏడీ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, గ్రౌండ్ వాటర్ డీడీ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక పై స్పష్టత ఏదీ?

కూటమి సర్కార్ జూలై 8న ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చింది. గతంలో ఇసుక ఉచితం అని చెప్పినా జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు పాయింట్ల వద్ద టన్నుల లెక్క విక్రయించారు. జూలై 8న జిల్లాలో నాలుగుచోట్ల ఏర్పాటు చేసిన ఉచిత ఇసుక పాయింట్లు మూతపడ్డాయి. ఆ తర్వాత ఆరు నెలలకు మళ్లీ ఉచిత ఇసుక గుర్తుకు వచ్చింది. ఇప్పుడు ఏర్పాటు చేస్తామన్న మూడు పాయింట్లను ఏజెన్సీకి ఇస్తున్నట్లు చెప్పారు. అయితే ఏజెన్సీకి ఏ పద్ధతిలో ఇస్తున్నారో క్లారిటీ లేదు.

క్లుప్తంగా

దీని వెనుక మర్మమేమిటి గోవిందా ?

తిరుపతి లీగల్: తిరుమలకు కల్తీ నెయ్యి తరలించారన్న అభియోగంపై నమోదైన కేసును తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి ఏసీబీ కోర్టుకు బదిలీ చేయాలని సిట్ పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ వేయడం చర్చనీయాంశమైంది. సిట్ అధికారులు కేసు దర్యాప్తు చేసి నలుగురిపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్ట్ చేసి స్థానిక కోర్టులో హాజరు పరిచారు. ప్రస్తుతం నలుగురు నిందితులు కోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకున్నారు. బెయిల్ పిటిషన్లపై కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంది. అయితే అదేరోజు సిట్ పోలీసులు కేసు ఏసీబీ కోర్టు పరిధిలోకి వస్తుందంటూ పిటిషన్ దాఖలు చేయడంపై న్యాయవాదులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ పిటిషన్ దాఖలు చేయడంపై ఏదో మర్మం దాగి ఉందని న్యాయవాదులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రోగులకు సీఎం సహాయ నిధి చెక్కులు

తిరుపతి అర్బన్: ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న నలుగురు రోగులకు మంగళవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు అందించారు. ఇందులో చిన్నగొట్టిగల్లు మండలం, టి.కుమ్మరపల్లికి చెందిన ఏ.చిన్నరెడ్డప్పకు రూ.లక్ష, తిరుపతి పట్టణానికి చెందిన ఎం.చంద్రశేఖర్‌కు రూ.1.6 లక్షలు అందజేశారు. అలాగే రామచంద్రాపురం మండలం, నెన్నూరు గ్రామానికి చెందిన ఎం.స్వర్ణలతకు రూ.2 లక్షలు, కార్వేటి నగరానికి చెందిన పాపమ్మ కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందించారు.

తిరుపతిలో ఇటీవల ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన జాబ్ మేళాకు తరలివచ్చిన నిరుద్యోగులు



బాబూ.. ఏది జాబు?

జిల్లాలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య

- కానరాని నోటిఫికేషన్లు.. కనికరించని కూటమి నేతలు
- స్తంభించిన పారిశ్రామిక రంగం
- జాబ్ క్యాలెండర్ జాడలేక వెతలు
- వలసబాట పడుతున్న యువత
- జిల్లాలో 6 లక్షల 23వేల మంది నిరుద్యోగుల ఆర్తనాదాలు

తిరుపతి సిటీ: 'యువతకు 20 లక్షల ఉద్యోగాలు, జాబ్ వచ్చేంతవరకు నెలకు రూ.3వేలు భృతి'... ఇవీ ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్‌లో భాగంగా నిరుద్యోగ యువతకు చంద్రబాబు ఇచ్చిన వరాలు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్నా ఇంతవరకు నిరుద్యోగ భృతిపై నోరు మెదపడం లేదు. జాబ్ క్యాలెండ్ జాడలేకపోవడంతో జిల్లాలోని నిరుద్యోగ యువత పొట్ట చేతబట్టుకుని పక్క రాష్ట్రాలకు వలసబాట పడుతున్నారు. మూడుపూటలా కడుపునిండితే చాలు..చిరు ఉద్యోగమైనా చేస్తామంటూ పీజీలు, పీహెచ్‌డీలు చేసిన యువకులు ఎక్కడ జాబ్ మేళాలు ఏర్పాటు చేసినా వేల సంఖ్యలో ఎగబడుతున్నారు.

- తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇటీవల ఓ సంస్థ జాబ్‌మేళా ఏర్పాటు చేసింది. సుమారు 80 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 2 వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఎస్ఎస్సీ అర్హతగల ఉద్యోగానికి సైతం పీజీలు పూర్తిచేసిన యువత హాజరుకావడంతో నిర్వాహకులు ముక్కున వేలువేసుకున్నారు.
- రేణిగుంటకు చెందిన వరప్రసాద్ ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తిచేశాడు. పేరొందిన కార్పొరేట్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి డీఎస్సీ నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేశారు. ఎంతో ఆశతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో వరప్రసాద్ ఉద్యోగాన్ని వదులుకుని లక్షలు అప్పుచేసి కోచింగ్ సెంటర్ బాటపట్టారు. ఏడాది కావస్తున్నా అతీగతి లేదు. మళ్లీ జాబ్ వేటలో చెన్నైకి వెళ్లి ఓ హోటల్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు..

.. జిల్లాలో నిరుద్యోగ సమస్య పెరుగుతోందనడానికి ఇవి మచ్చుకు రెండు మాత్రమే. జిల్లాలో ప్రతి ఏటా నిరుద్యోగులు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నారు. పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వారు సైతం ఖాళీగా ఇంటి పట్టునే ఉండిపోతున్నారు. కూటమి ప్రభుత్వం జాబ్‌క్యాలెండర్ పూర్తిగా విస్మరించడం ఏంచేయాలో తెలియక తికమకపడుతున్నారు.

18 నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగ యువత వివరాలు

గత ఏడాది ఎన్నికల ముందు ఓ ప్రైవేటు ఎన్ఆర్ఐ సంస్థ ద్వారా తిరుపతి జిల్లాలో చేపట్టిన సర్వే ప్రకారం ఎస్ఎస్సీ నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు నియోజకవార్గాల వారీగా నిరుద్యోగ భృతికి అర్హులైన వారి జాబితా దాదాపుగా 6లక్షలా 23వేల మంది ఉన్నట్లు తేలింది. జిల్లాలో ఒక్కో నిరుద్యోగికి భృతి రూ.3వేల చొప్పున మొత్తం రూ.186.90కోట్లు నెలకు చెల్లించాల్సి ఉంది.

నియోజకవర్గం	యువత
తిరుపతి	1,30,000
చంద్రగిరి	85,000
శ్రీకాళహస్తి	93,000
సత్యవేడు	80,000
వెంకటగిరి	90,000
గూడూరు	75,000
సూళ్లూరుపేట	70,000
ఇందులో ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, టీటీసీ, డిప్లొమో చేసినవారు	1,25,000
డిగ్రీ, బీటెక్, బీఈడీ పూర్తి చేసిన వారు	1,55,000
పీజీ, పీహెచ్‌డీ	85,000
వృత్తి విద్య, మెడకల్, టెక్నికల్ కోర్సులు పూర్తి చేసినవారు	2,58,000

పరిస్థితి దారుణం



జిల్లాలో నిరుద్యోగం తాండవిస్తోంది. నోటిఫికేషన్లు లేవు. నిరుద్యోగ భృతి లేదు. ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రభుత్వ ఖాళీలు భర్తీ చేయడంలేదు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చేంతవరకు భృతి ఇవ్వాల్సిందే. – బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, తిరుపతి జిల్లా

ఎక్కడ జాబ్ మేళా జరుగుతున్నా..



ఉద్యోగ వేటలో ఏడాదిగా తిరిగి తిరిగి విసిగిపోయా. బీటెక్ సివిల్ పూర్తిచేశాను. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ ఊసేలేదు. ప్రైవేటు కంపెనీలు రావడం లేదు. దీంతో కొత్త ఉద్యోగాలు జాడ కనిపించడం లేదు. ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. జిల్లాలో ఎక్కడ జాబ్ మేళా జరిగినా పడిగెడుతున్నా.

–రమణారెడ్డి, బీటెక్, చంద్రగిరి

ఉద్యోగావకాశాల్లేవు



నేను ఎంఏ పీహెచ్‌డీ చేశాను. వర్సిటీలో అధ్యాపక పోస్టులకు గత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంతో శ్రమించి కోచింగ్ తీసుకున్నా. కానీ కూటమి సర్కార్ ఆ నోటిఫికేషన్‌ను తుంగలో తొక్కేసింది. గత ఏడాది ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదు. బెంగళూరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేసేందుకు ఇంటర్వ్యూ పూర్తిచేశాను. వచ్చే నెల నుంచి అక్కడికి వెళ్లకతప్పడం లేదు.

–పూజిత, ఎంఏ, పీహెచ్‌డీ, తిరుపతి

బాలిక అప్పగింత



తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

తిరుమల: శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఓ కుటుంబానికి చెందిన బాలిక తప్పిపోగా పోలీసులు గుర్తించి బంధువులకు అప్పగించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం, మెహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడకు చెందిన ఎం.రవి, ఎం.వెంకటేశ్వరి కుమార్తె దివ్య(5)తో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం పీఏసీ–3 వద్ద బాలికను వదిలి తిరుపతికి వెళ్లిపోయారు. అనంతరం బాలిక కనిపించకపోవడంతో తిరుపతి బస్టాండ్‌లోని పోలీస్ ఔట్‌పోస్టుకు సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది కమాండ్‌కంట్రోల్ ద్వారా తిరుమల పోలీసులకు సమాచారం అందించగా వెంటనే బ్లూకోల్ట్ సిబ్బంది బాలిక తప్పిపోయిన ప్రదేశానికి చేరుకుని దివ్యను గుర్తించారు. అనంతరం బంధువులకు అప్పటించారు.

రేపటి నుంచి ఏపీ ఐసెట్‌కు దరఖాస్తులు

తిరుపతి సిటీ: ఏపీ ఐసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. 2025–26వ విద్యాసంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఏపీ ఐసెట్ పరీక్షకు గురువారం నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మే 7వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు.

కారులో చెలరేగిన మంటలు

పాకాల: ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన మండలంలోని పదిపుట్లబైలు వద్ద చోటుచేసుకుంది. మంగళవారం ఎస్ఎఫ్ఓ గుణశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి మండలం, రెడ్డివారిపల్లి గ్రామానికి చెందిన రాజేంద్ర ప్రసాద్ తిరుపతి నుంచి మదనపల్లికి కారులో పదిపుట్లబైలు క్రాస్ రోడ్డు వద్ద మహేంద్ర కారులో తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో ప్రయాణిస్తున్నాడు. ఇంతలో కారులో మంటలు చెలరేగాయి. చిత్తూరు కంట్రోల్ రూం నుంచి సమాచారం రావడంతో తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్టు ఎస్ఎఫ్ఓ తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదని వివరించారు. అగ్నిమాపక సిబ్బంది మనోహర్‌రెడ్డి, సురేంద్రబాబు, బాలాజీ, నాగార్జున పాల్గొన్నారు.

భారత్ ఆత్మగౌరవం అమెరికాకు తాకట్టు



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

తిరుపతి కల్చరల్: బీజేపీ ప్రభుత్వం బ్లాక్ మెయిల్‌లో నెంబర్ ఒన్ అని, భారత్ ఆత్మగౌరవాన్ని అమెరికాకు తాకట్టుపెట్టే చర్యలు చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మండిపడ్డారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో చంద్రబాబు, నితీష్ కుమారులు ఇద్దరకూ కలిసి సొంత ప్రయోజనాల కోసం మోదీని కాపాడారని విమర్శించారు. అధిక మంది పిల్లలను కందాం అనే దరిద్రమైన బీజేపీ స్లోగన్‌ను చంద్రబాబు బుజాన వేసుకున్నారని మండిపడ్డారు.

ప్రధాన మంత్రి పంటల బీమా పరిస్థితి ఏంటి?

– లోక్ సభలో తిరుపతి ఎంపీ గురుమూర్తి



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధాన మంత్రి పంటల బీమా యోజన కింద సరిగా అమలు చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి మంగళవారం లోక్ సభలో ప్రశ్నించారు. ప్రధాన మంత్రి పంటల బీమా యోజన, మార్పు చేసిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకం (ఆర్.డబ్లు.బి.సి.ఐ.ఎస్) కింద 2.63 లక్షల మంది రైతులు తమ పంటలకు బీమా నమోదు చేసుకున్నారని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ సమాధానం ఇచ్చారు. ఈ పథకం కోసం 2022–23 సంవత్సరంలో 1,09,865 మంది రైతులు 1,16,895 హెక్టార్ల భూభాగానికి నమోదు చేసుకున్నారని తెలిపారు. అలాగే 2023–24లో 1,18,880 మంది రైతులు 1,42,695 హెక్టార్లకు, 2024–25లో 35,553 మంది, 45,507 హెక్టార్ల కు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ పథకం కింద వరి, వేరుశనగ, సజ్జలు, పత్తి, పెసలు తదితర పంటలకు బీమా అందిస్తామని తెలిపారు.

16 వరకు డిగ్రీ సెమిస్టర్ ఫీజు గడువు పొడిగింపు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో డిగ్రీ, 2, 4, 6వ సెమిస్టర్లకు సంబంధించి పరీక్ష ఫీజును విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈనెల 16వరకు పొడిగించినట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీకి ఫీజు గడువు ముగియడంతో విద్యార్థుల, కళాశాల అభ్యర్థన మేరకు పొడిగించినట్లు తెలియజేశారు.

రెండు కార్లు రికవరీ



కార్లు, నిందితులతో సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ : బాడుగకు తీసుకుని అమ్మేసిన రెండు కార్లను రికవరీ చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు స్థానిక సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు. మంగళవారం వారు స్థానిక పోలీసుస్టేషన్‌లో రికవరీ చేసి కార్లను, అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను చూపారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ఆర్ అనంతపురం గ్రామానికి చెందిన మహేష్, తిమ్మభూపాలపురం గ్రామానికి చెందిన ఉమాశంకర్‌కు ఆమేజ్, ఎర్టిగా కార్లను నెల బాడుగకు ఇచ్చారు. అయితే ఉమాశంకర్ అనుచరులు దశరథన్, జాఫర్‌బాషాలతో కలసి పాకాలకు చెందిన వారికి వాహనాల రికార్డులను తారుమారు చేసి అమ్మేశారు. ఉమాశంకర్ కార్లు బాడుగ ఇవ్వకపోగా, కార్లను అమ్మేశాడని తెలియడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో మహేష్ ఫిర్యాదు చేశారు. దీంతో గాలించగా పాకాలలో ఉన్నట్లు సమాచారం అందడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్ల విలువ రూ.25 లక్షలు ఉంటుందని తెలిపారు. ఉమశంకర్ పరారీలో ఉండడంతో దశరథన్, జాఫర్‌బాషాను అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతుడు ఆదినారయ్య(ఫైల్)

రేణిగుంట: తిరుపతి–శ్రీకాళహస్తి మార్గం రాచగున్నేరి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్‌కు రక్తగాయాలయ్యాయి. రూరల్ పోలీసుల కథనం .. శ్రీకాళహస్తి మండలం, రామలింగాపురానికి చెందిన ఆదినారయ్య(60 తన పొలంలోని వరిగడ్డిని డ్రైవర్ బత్తెయ్యతో కలిసి ట్రాక్టర్‌పై వేసుకుని బంగారుపాళెం సమీపంలో విక్రయించి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రాచగున్నేరి సమీపంలో ఓ గుర్తు తెలియని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో కూర్చున్న ఆదినారయ్య కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ నడుపుతున్న బత్తెయ్యకు రక్తగాయాలయ్యాయి. ఢీకొన్న బస్సు ఆగకుండా వెళ్లిపోవడంతో ప్రమాదానికి కారణమైన బస్సును కనుగునేందుకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అన్నదానం ట్రస్ట్ విరాళాలు రూ.2,200 కోట్లు

తిరుమల: టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు భక్తులు అందించే విరాళాలు రూ.2,200 కోట్లు దాటినట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. 1985లో తిరుమలలో అన్నదాన పథకాన్ని అప్పటి సీఎం ఎన్టీ రామారావు ప్రారంభించారని గుర్తుచేశారు. 2014లో శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌గా పేరు మార్చినట్టు వెల్లడించారు. నాడు 2 వేల మందితో ప్రారంభమై నేడు రోజుకు లక్ష మంది భక్తులకు అన్న వితరణ చేసే స్థాయికి అన్నదానం ట్రస్ట్ అభివృద్ధి చెందిందన్నారు. అత్యధికంగా 9.7 లక్షల మంది దాతలను కలిగి ఉందన్నారు. రూ.కోటి అంతకుమించి విరాళమిచ్చిన దాతలు 139 మంది ఉన్నారని తెలిపారు. ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షల విరాళాన్ని 249 మంది అందజేసినట్లు తెలిపారు.

స్విమ్స్ ఫిజియోథెరపీతో నిరంతర వైద్యవిద్య

తిరుపతి తుడా: స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్య కార్యక్రమం మంగళవారం పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ నిరంతర వైదవిద్య కార్యక్రమంతో వైద్య విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. అనంతరం వైద్యుని పుణులు మూత్ర విసర్జనలో సమస్యలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫిజియోథెరఫీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే మాధవి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



సినీ నటుడు, దర్శకుడు వేణు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 69,746 మంది స్వామివారిని దర్శించుకోగా 23,649 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.27 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు వేణు, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.